E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 13 -05-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



నాగార్జునసాగర్ బుద్ధవనంలో ప్రపంచ సుందరీమణులు » 2లో

# ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని దెబ్బ కొట్టాం.. సైన్యానికి సెల్యూట్: ప్రధాని మోదీ



- ఉగ్ర భూతంపై ఆపరేషన్ సిందూర్
- ఇకపై మన దేశ అధికారిక విధానమిదే
- పాకిస్తాన్ దుశ్చర్యలన్నింటికీ ఇలాగే బదులిస్తాం
- ఉగ్రవాదాన్ని, పాకిస్తాన్‌ను ఇక వేరుగా చూడబోం
- పాక్ సైన్యం, ప్రభుత్వమే ఉగ్రవాద పోషకులు
- ఎప్పటికైనా ఆ భూతానికే బలవుతుంది
- ఉగ్రవాదం, వాణిజ్యం, చర్చలు ఒకే ఒరలో ఇమడవు
- నీళ్లు, రక్తమూ ఎన్నటికీ కలిసి ప్రవహించలేవు
- ఉగ్రవాదులు మన మహిళల సిందూరం తుడిచేశారు
- ఉగ్రమూలాలతో పాటు వారి స్థైర్యాన్ని పెకిలించేశాం
- 9/11 వంటి ఉగ్ర దాడుల కేంద్రాలు భస్మీపటలం

**ఉగ్రమూకలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు.**

ఈ కబురు,దిల్లీ: ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా మన సైన్యం వారిని దెబ్బతీసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైనికుల పరాక్రమం, సాహసాలకు సెల్యూట్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుద ముట్టిస్తామని స్పష్టం చేశారు. 'న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్'కు పాల్పడితే సహించేది లేదని పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని ప్రకటించారు.

తరువాయి 2లో

టెస్టులకు విరాట్ కోహ్లీ గుడ్‌బై.. రిటైర్మెంట్...... ప్రకటించిన స్టార్ క్రికెటర్ » 6లో



భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు » 4లో



పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి తొలి సినిమా.. లేటెస్ట్ అప్‌డేట్ ఇదే! » 5లో



అమెరికా, చైనా డీల్: ఒక్కసారిగా తగ్గిన బంగారం ధరలు » 4లో





## త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీని ఆవిష్కరిస్తాం

**ఐటీ సంస్థల కొత్త క్యాంపస్‌లన్నీ హైదరాబాద్‌లోనే**
**రాష్ట్రానికి 16 నెలల్లో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు**
**సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి**

*"ఐటీ హబ్‌గా ఉన్న తెలంగాణను ప్రపంచ ఐటీ సంస్థల చిరునామాగా మార్చాం. దాంతో మైక్రోసాఫ్ట్, విప్రో, అమెజాన్ వంటి మేటి ఐటీ సంస్థల కొత్త క్యాంపస్‌లు, జీసీసీలు హైదరాబాద్‌కు తరలివస్తున్నాయి. కృత్రిమమేధ నగరం, స్కిల్స్ యూనివర్సిటీలతో కూడిన భారత్ ఫ్యూచర్ సిటీని త్వరలో*

ఈ కబురు, : ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరుపొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని ఇంకా మరిన్ని ప్రపంచ ఈవెంట్‌లకు తెలంగాణ ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతోందని ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా మార్చడంలో అందరి సహకారం కోరుతున్నామన్నారు. ఇవాళ హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో సోనాటా సాఫ్ట్‌వేర్ కొత్త క్యాంపస్ ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

తరువాయి 2లో

## అందరికీ ఒకే తరహా యూనిఫాం.. భట్టి కీలక ప్రకటన



» 2లో

## వాణిజ్యాన్ని నిలిపేస్తానన్నా'.. భారత్‌పాక్ వ్యవహారంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



భారత్- పాకిస్థాన్‌లు కాల్పుల విరమణ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ కబురు: భారత్- పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, దీనికి తమ యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

తరువాయి 2లో

## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్సీ కవిత



**తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు.

తరువాయి 2లో

## కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు..

**తాము పాకిస్థాన్‌లో అణు నిల్వలను టార్గెట్ చేయలేదని భారత సైన్యం స్పష్టం చేసింది.**

ఈ కబురు: ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు



» 3లో

## యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు: ఆర్మీ మాజీ చీఫ్

**భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై పెదవి విరుస్తున్న వారికి ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే కౌంటర్ ఇచ్చారు. యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదన్నారు.**

ఈ కబురు,పుణె: భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాల మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. చేశారు.



» 3లో

## మా పోరాటం ఉగ్రవాదులపైనే.. పాక్ నష్టానికి బాధ్యత వారిదే: రక్షణశాఖ



**పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని భారత రక్షణశాఖ అధికారులు తెలిపారు.**

ఈ కబురు: 'ఆపరేషన్ సిందూర్ 'లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులపైనే తమ పోరు అని 'ఆపరేషన్ సిందూర్'పై నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను అధికారులు ప్రదర్శించారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు. పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం: ఏకే భారతి "పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం. పీవోకేలో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా మనం యుద్ధం చేశాం. అత్యాధునిక క్షిపణి రక్షక వ్యవస్థలతో పాక్ క్షిపణులు, డ్రోన్‌లను తిప్పికొట్టాం. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్‌ను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకూ ఎలాంటి నష్టం చేయలేదు. అదే సమయంలో పాకిస్థాన్ వైపు నుంచి దాడులను సమర్థంగా తిప్పికొట్టాం.

తరువాయి 2లో

## సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి వచ్చేయండి: సీఎం ఒమర్ అబ్దుల్లా



**కాల్పుల మోత మోగిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంటున్న వేళ జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు.**

ఈ కబురు: కాల్పులతో దద్దరిల్లిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంటున్న తరుణంలో జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. ఇటీవల సరిహద్దు గ్రామాలను ఖాళీ చేసి వేరే చోటకు తరలివెళ్లిన ప్రజలు తిరిగి తమ సొంత నివాసాలకు రావాలని సూచించారు. భారత్ పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల వల్ల ప్రభావితమైన పలు ప్రాంతాల్లో సీఎం ఒమర్ పర్యటించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి తమ సొంత ఇళ్లకు చేరాలి. ఉద్రిక్తతలతో పూంఛ్ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా, ఈ జిల్లాలో సుమారు 80 నుంచి 90 శాతం వరకు ప్రజలు తమ నివాసాలను ఖాళీ చేశారు. వారు తప్పకుండా తిరిగి రావాలి" అని సీఎం పేర్కొన్నారు.

తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి



## నాగార్జునసాగర్ బుద్ధవనంలో ప్రపంచ సుందరీమణులు

**మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రపంచ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో పర్యటించారు.**

ఈ కబురు,నాగార్జునసాగర్: మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రపంచ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో పర్యటించారు. వారికి జానపద, గిరిజన నృత్య కళాకారులు ఘనస్వాగతం పలికారు. వారంతా అక్కడి పరిసరాలను చూసి అమితానందం పొందారు. బౌద్ధ థీమ్‌పార్క్‌లోని బుద్ధ విగ్రహాల వద్ద జరిగిన ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతకుముందు పర్యాటక సంస్థ విజయ్ విహార్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సుందరీమణులంతా ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. బుద్ధపూర్ణిమను పురస్కరించుకొని వారంతా బుద్ధవన సందర్శనకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండియా, బంగ్లాదేశ్, కంబోడియా, మయన్మార్, వియత్నాం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేసియా, జపాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, లెబనాన్, మంగోలియా, నేపాల్, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, తుర్కియే, చైనా, థాయ్‌లాండ్, ఆర్మేనియా దేశాలకు చెందిన అభ్యర్థులు మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనను న్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్సీ కవిత

"టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ. లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..
నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.



మొదటి పేజీ తరువాయి

# త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీని ఆవిష్కరిస్తాం



**అన్ని రంగాల్లో హైదరాబాద్ దూసుకుపోతోందని హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారాలని.. మన విజయాలను ప్రపంచానికి చూపాలని పిలుపునిచ్చారు.**

"ఐటీ హబ్‌గా ఉన్న తెలంగాణను ప్రపంచ ఐటీ సంస్థల చిరునామాగా మార్చాం. దాంతో మైక్రో సాఫ్ట్, విప్రో, అమెజాన్ వంటి మేటి ఐటీ సంస్థల కొత్త క్యాంపస్‌లు, జీసీసీలు హైదరాబాద్‌కు తరలి వస్తున్నాయి. కృత్రిమమేధ నగరం, స్కిల్స్ యూనివర్సిటీలతో కూడిన భారత్ ఫ్యూచర్ సిటీని త్వరలో ఆవిష్కరించనున్నాం. ఆవిష్కరించనున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన 16 నెలల్లో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. "యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తూ... ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో లక్షకుపైగా ఉద్యోగాలు ఇప్పించాం. తాజాగా రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తున్నాం. రాష్ట్రంలోని 66 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నాం.

**అన్ని రంగాల్లో ప్రథమ స్థానం మనదే**

ప్రభుత్వ నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలతో అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. ఉపాధి, ఉద్యోగ కల్పన, పోలీసింగ్, ద్రవ్యోల్బణం అదుపులో నంబర్‌వన్‌గా నిలిచాం. దావోస్‌కు వెళ్లినప్పుడు మన రాష్ట్ర ప్రతిభను చూసి వివిధ సంస్థలు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. త్వరలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని బందరు పోర్టుతో అనుసంధానించనున్నాం. ఐటీరంగంతో పాటు లైఫ్ సైన్సెస్‌లోనూ వేగంగా ముందుకు వెళ్తున్నాం" అని వివరించారు. నిరుద్యోగులకు తమ ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఇంకా అనేక రంగాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ కు హబ్‌గా మారిందన్నారు. ఏఐరెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు కేంద్రంగా మారిందన్నారు. నగరంలో అనేక ప్రముఖ కంపెనీలు తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే పరిశ్రమలకు మద్దతు ఇస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోందన్నారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, 1 లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించామన్నారు. 2025లో దావోస్‌లో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి నంబర్ 1 రాష్ట్రంగా నిలిచిందని సీఎం చెప్పారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రం పోలీసింగ్, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణ నిర్వహణ, ఉద్యోగ సృష్టి, పన్ను వసూళ్లలో నంబర్ వన్ గా ఉందని వెల్లడించారు. 66 లక్షల మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా సాధికారత, రాజీవ్ యువ వికాసం ద్వారా యువత వ్యాపారాలు, స్వయం ఉపాధికి అవసరమైన నిధులు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్ స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతోందన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వాణిజ్యాన్ని నిలిపేస్తానన్నా'.. భారత్‌పాక్ వ్యవహారంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



ఈ వ్యవహారంలో ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో వాణిజ్యం నిలిపేస్తానంటూ ఇరుదేశాలకూ స్పష్టం చేశానని.. ఈ క్రమంలో అవి అంగీకారానికి వచ్చాయని మీడియా సమావేశంలో వెల్లడించారు. వాణిజ్యం అనే అస్త్రాన్ని తాను వాడినట్లుగా ఇతరులెవరూ వాడలేదన్నారు. "భారత్ పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు మా యంత్రాంగం మధ్యవర్తిత్వం వహించింది. తద్వారా రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ప్రమాదకర ఘర్షణకు ముగింపు పలికింది. ఇరుదేశాల నాయకత్వం దృఢంగా, శక్తిమంతంగా ఉంది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్నారు. ఈ విషయంలో మేం చాలా సాయం చేశాం. వాణిజ్యం విషయంలోనూ అండగా ఉన్నాం. 'మీతో (భారత్, పాక్) వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోనున్నాం. ఉద్రిక్తతలకు ముగింపు పలకండి. అలా అయితేనే.. ముందడుగు వేస్తాం. లేకపోతే.. ఎటువంటి వాణిజ్యం చేయబోం' అని చెప్పాను. దీంతో ఆ రెండు దేశాలు సానుకూలంగా స్పందించాయి" అని ట్రంప్ తెలిపారు. తాను వాడినట్లు ఇతరులెవరూ వాణిజ్యాన్ని ఉపయోగించలేదని చెప్పారు. ఇరు దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని అంతకుముందు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన తన తొలి విడత పాలన సమయంలో కూడా కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధపడ్డారు. నాటి పాక్, భారత్ ప్రధానుల వద్ద దీన్ని ప్రస్తావించారు. కానీ, భారత్ నాడు మూడో పక్షం జోక్యాన్ని సున్నితంగా తిరస్కరించింది. దీంతో ట్రంప్ ఈ విషయంలో పెద్దగా వ్యాఖ్యలు చేయలేదు.

మొదటి పేజీ తరువాయి

## అందరికీ ఒకే తరహా యూనిఫాం.. భట్టి కీలక ప్రకటన



ఈ కబురు: విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా క్షణం కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నామని, అకుంఠిత దీక్ష, నిబద్ధతతో సిబ్బంది పనిచేయడం వల్లే సాధ్యమైందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ ప్రజాభవన్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ అండ్‌మెయింటెనెన్స్ సిబ్బందితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంటరాక్షన్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్‌చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంట్ ఉండదని దుష్ప్రచారం చేసిన వారికి చెంపపెట్టు లాగా ఈ ఏడాది మార్చిలో 17,162 మెగావాట్లకు పైగా పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క నిమిషం కూడా కరెంటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసి వారి విమర్శలను తిప్పి కొట్టిన విద్యుత్తు సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉన్నత స్థాయిలో నేను, యజమాన్యాలు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న సేవలను గుర్తించి అభినందించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బందిని ప్రజా ప్రభుత్వం ఎప్పటికీ ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పదోన్నతుల సమస్యను అధికారులలంలోకి రాగానే పరిష్కరించి వేల మందికి పదోన్నతులు కల్పించామన్నారు. మనందరం ఒకటే అన్న భావన కల్పించేందుకు డిస్కం కంపెనీలో పనిచేస్తున్న లైన్మెన్ నుంచి సీఎండీ వరకు ఒకే తరహా యూనిఫాం తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. అలాగే, నిఫ్ట తో డిజైన్ చేయించి విద్యుత్ సిబ్బందికి డ్రెస్సులు ఇస్తామని ప్రకటించారు. యజమాన్యంతో పరిష్కారం కానటువంటి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటానని విద్యుత్ సిబ్బందికి భరోసా ఇచ్చారు. థర్మల్, సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వంతోనూ, హైడల్ పవర్ ఉత్పత్తి చేయడానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలతో ఎంఓయూ చేసుకున్నామని వివరించారు.

మొదటి పేజీ తరువాయి



# ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని దెబ్బ కొట్టాం.. సైన్యానికి సెల్యూట్: ప్రధాని మోదీ



**సైన్యం సాహసం, పరాక్రమానికి సెల్యూట్**

"కొన్ని రోజులుగా మనమందరం దేశ సామర్థ్యం, సహనాన్ని రెండింటినీ చూశాం. భారత దేశ పరాక్రమ సేనకు, సరిహద్దు బలగాలు, నిఘా సంస్థలు, శాస్త్రవేత్తలకు ప్రతి భారతీయుడి తరఫున సెల్యూట్ చేస్తున్నా. మన వీర సైనికులు 'ఆపరేషన్ సిందూర్'లో కచ్చితత్వంతో అసమాన శౌర్యాన్ని చూపిస్తూ లక్ష్యాలను ఛేదించారు. వారి వీరత్వం, పరాక్రమం, సాహసానికి సెల్యూట్ చేస్తున్నా.. మన దేశంలోని ప్రతి తల్లి, ప్రతి సోదరి, ప్రతి కుమార్తెకు ఈ పరాక్రమం అంకితం. పహల్గాంలో ఉగ్రవాదులు క్రూరత్వాన్ని చూపించారు. ఈ ఘటన దేశాన్ని, యావత్ ప్రపంచాన్ని వణికించింది. సెలవుల్లో గడిపేందుకు వెళ్లిన అమాయకులను మతం అడిగి మరీ కుటుంబ సభ్యుల ముందే నిర్దయగా కాల్చి చంపారు. ఇది ఉగ్రవాద బీభత్సానికి, క్రూరత్వానికీ ప్రతీక. దేశంలోని సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నమిది. వ్యక్తిగతంగా నాకెంతో బాధను కలిగించింది. ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు భారతీయ సైన్యానికి పూర్తి స్వేచ్ఛను కల్పించాం"

**బెంబేలెత్తిన పాక్.. చర్చలకు పరుగెత్తుకొచ్చింది..**

"పౌరులు, పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచాయి. భారతీయ మహిళల నుదుట సిందూరాన్ని చెరిపేస్తే.. దానికి సమాధానం ఎలా ఉంటుందో ప్రతి ఉగ్రవాది, ఉగ్రసంస్థకూ అర్థమైంది. ఆపరేషన్ సిందూర్.. ఒక పేరుకాదు.. ఇది దేశంలోని కోట్లాది మంది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉంది. ఆపరేషన్ సిందూర్ న్యాయం కోసం ఒక అఖండమైన ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞతోనే ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా భారత్ దెబ్బతీసింది. ఉగ్రవాదుల శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు కచ్చితమైన లక్ష్యంతో దాడులు నిర్వహించాయి. బహావల్‌పుర్, మురుద్కే లాంటి తీవ్రవాద స్థావరాలపై దాడి చేసి భీతావహ పరిస్థితిని సృష్టించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సానుభూతిపరులకు ఏం చేస్తుందో భారత్ చెప్పింది. పాక్ గర్వంగా చెప్పుకొనే మిసైళ్లను ధ్వంసం చేశాం. పాకిస్థాన్ విమానాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితిని తీసుకొచ్చింది. మన చర్యలకు బెంబేలెత్తిపోయిన పాకిస్థాన్ కాల్పుల విరమణ కోసం ప్రపంచం మొత్తాన్ని వేడుకుంది. పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ చర్చలకు పరిగెత్తుకుంటూ వచ్చారు"

**పాక్ రక్షణ వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం..**

"రెండున్నర దశాబ్దాలుగా పాక్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఉగ్రవాద తండాలను ఒక్క దెబ్బతో భారత్ తుడిచిపెట్టింది. మనదేశానికి వ్యతిరేకంగా పాక్ నుంచి కుట్రలు పన్నుతున్న ఉగ్రతండాలను తుదముట్టించింది. మన దెబ్బకు పాక్ నిరాశనిస్పృహల్లో కూరుకుపోయింది. అచేతనావస్థకు చేరుకుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తోన్న పోరాటానికి మద్దతుగా నిలవాల్సింది పోయి పాకిస్థాన్.. భారత్‌పై దాడిని ప్రారంభించింది. మన స్కూళ్లు, కాలేజీలు, గురుద్వారాలు, సామాన్య పౌరుల నివాసాలే లక్ష్యంగా దాడులు చేసింది. మన సైనిక స్థావరాలను టార్గెట్ చేసుకుంది. దీంతో పాక్ నిజస్వరూపం, కుట్రలు బట్టబయలయ్యాయి. పాక్ నుంచి ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను మన క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దులు దాటకుండానే కూల్చేసింది. పాక్ రక్షణ వ్యవస్థలను భారత క్షిపణులు ఛిన్నాభిన్నం చేశాయి. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లలో మన మిసైళ్లు విధ్వంసం సృష్టించాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ అసహ్యకరమైన సత్యాన్ని ప్రపంచం మరోసారి చూసింది. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైన్యంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజానికి ఇంతకన్నా పెద్ద సాక్ష్యం ఇంకేం కావాలి?"

**భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు**

"ఎలాంటి దుస్సాహసానికి పాక్ తెగబడినా మన దళాలు చావు దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విస్పష్టంగా చెప్పాయి. ఉగ్రవాదంపై షరతుల మేరకే చర్చలు ఉంటాయి. మన నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయి. పాకిస్థాన్ అణు బ్లాక్‌మెయిలింగ్ ఇక సహించేది లేదు. అణుశక్తి, అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా భారత్ తుదముట్టించి తీరుతుంది. భారత రక్షణ దళాల సామర్థ్యం ఏంటో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ చవిచూసింది. సాంకేతిక యుద్ధంలో భారత్ పరిణతి, ఆయుధ సంపత్తిని ప్రదర్శించింది. మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థలు ఎంత బలమైనవో.. ఎంత శక్తిమంతమైనవో చాటింది"

**పాకిస్థాన్ బతికి బట్టకట్టాలనుకుంటే.. మోదీ సీరియస్ వార్నింగ్**

"ఈ యుగం యుద్ధాలది కాదు.. ఉగ్రవాదానిది అంతకన్నా కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు, దాడులకూ భారత్ వెనుకాడదు. ఉగ్రవాదానికి అన్నపానీయాలు అందించే ఎవరినీ ఉపేక్షించదు. పాక్ బతకాలంటే ఉగ్రవాద శిబిరాలను తనంతట తానుగా తుడిచిపెట్టాలి. టెర్రరిజం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవు. ఉగ్రవాదం, వాణిజ్యం రెండూ ఏకకాలంలో ఉండవు. రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవు. పాక్‌తో చర్చలు జరిగితే అది ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే" అని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తీరును ఎండగడుతూనే తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాద చర్యలకు ఇకపై ఆపరేషన్ సిందూర్‌తోనే బదులిస్తాం. ఇదే భారత ప్రభుత్వ నీతి. ఇదే మన నూతన విధానం" అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. "దాయాది అణు బెదిరింపులకు దిగితే సహించే ప్రసక్తే లేదు. అంతేకాదు, ఉగ్రవాదాన్నీ, దానికి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్న పాక్ ప్రభుత్వాన్నీ ఇకనుంచి వేర్వేరుగా చూడబోం. పాక్ చర్యలన్నింటినీ ఇకపై 'సిందూర్' గీటురాయితోనే పరిశీలిస్తాం. మనపై ఎలాంటి దుశ్చర్యకు పాల్పడ్డా 'సిందూర్' తరహాలో ఆ దేశంపై నిర్ణాయక రీతిలో దాడులు చేస్తాం. జన్మలో మర్చిపోలేని రీతిలో గుణపాఠం నేర్పుతాం" అని కుండబద్దలు కొట్టారు. పాక్ 'అణు' ఆటలు మనముందు సాగవని ఆ దేశ సైనిక స్థావరాలపై జరిపిన దాడులతో ప్రపంచానికి ఇప్పటికే నిరూపించామన్నారు. "కశ్మీర్ మంచుకొండల నుంచి రాజస్తాన్ ఎడారుల దాకా పాక్ దాడులన్నింటినీ తిప్పికొట్టాం. కేవలం మన సరిహద్దులపై దాడికి ప్రయత్నించినందుకే దాయాది ఆయువుపట్లను తూట్లు చేశాం. అది గొప్పగా చెప్పుకునే వైమానిక స్థావరాలన్నింటినీ పూర్తిగా నేలమట్టం చేసి కాళ్ల బేరానికి తీసుకొచ్చాం. భారత్‌తో యుద్ధానికి దిగిన ప్రతిసారీ పాక్‌ను మట్టి కరిపించాం" అని గుర్తు చేశారు. ఆ విజయ పరంపరలో ఆపరేషన్ సిందూర్‌ను కలికితురాయిగా అభివర్ణించారు. పాక్ ప్రభుత్వం, సైన్యం కలసికట్టుగా దశాబ్దాలుగా పెంచి పోషిస్తున్న ఉగ్రవాద భూతం చివరికి ఆ దేశాన్నే కబళిస్తుందని మోదీ హెచ్చరించారు. "ఆ దేశం మనుగడ సాగించాలంటే ఉగ్రవాదాన్ని దాని గడ్డపై నుంచి కూకటివేళ్లతో పెకిలించాల్సిందే. దానికి మరో మార్గం లేదు" అంటూ హితవు పలికారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని తొలిసారిగా సోమవారం రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. పాక్‌పై మన సైనిక విజయాన్ని దేశంలోని ప్రతి తల్లికి, సోదరికి, కూతురికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

**సిందూర్... దేశ భావనకు ప్రతిరూపం**

"సిందూరం కేవలం పేరు కాదు. సరైన న్యాయానికి అఖండ ప్రతిజ్ఞ. కోట్లాది భారతీయుల భావనలకు ప్రతిరూపం. ఉగ్రవాదం తాలూకు వికృత రూపమే పహల్గాం దాడి! అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడి నన్నెంతగానో కలచివేసింది. భార్యాపిల్లల కళ్ల ముందే ఒక్కొక్కరిని కాల్చి పొట్టన పెట్టుకున్న వికృతత్వాన్ని ప్రపంచ దేశాలన్నీ తీవ్రంగా ఖండించాయి. అందుకు ప్రతీకారం కోసం దేశమంతా ఒక్కటైంది. ఉగ్రవాదులను మట్టిలో కలిపేందుకు సైన్యానికి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. వారు కలలో కూడా ఊహించని విధంగా పాక్, పీఓకేలోని బహావల్‌పూర్, మురిద్కే తదితర ఉగ్రవాద కేంద్రాలు, శిక్షణ శిబిరాలపై మన సైన్యం విరుచుకుపడి నేలమట్టం చేసింది. అవన్నీ నిజానికి ప్రపంచ ఉగ్రవాద యూనివర్సిటీలు. అమెరికాపై 9/11, లండన్ మెట్రో తదితర దాడులన్నింటికీ అక్కడినుంచే పథకరచన జరిగింది. అలాంటి కేంద్రాలతో పాటు ఉగ్రవాదుల స్థైర్యాన్ని కూడా మన ధ్వంసం చేసింది. దశాబ్దాలుగా పాక్ గడ్డపై బాహాటంగా రొమ్ములు విరుచుకుని సంచరిస్తున్న 100 మందికి పైగా అత్యంత కరడుగట్టిన ఉగ్రవాదులను హతమార్చింది. మన మహిళల నుదుటి సిందూరం తుడిపేస్తే ఏమవుతుందో ప్రతి ఉగ్ర ముఠాకూ తెలిసొచ్చేలా చేశాం. ఉగ్రతండాలనే సమూలంగా తుడిచిపెట్టేశాం.

**కాల్పులకు కేవలం విరామమే**

ఉగ్ర కేంద్రాలపై మన దాడితో పాక్ బిక్కచచ్చిపోయింది. మన దాడుల్లో హతమైన ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపింది. వాటిలో పాక్ సైనిక ఉన్నతాధికారులు బాహాటంగా పాల్గొన్నారు. పాక్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉగ్రవాదులు చెలరేగిపోతున్నారనేందుకు ఇది తిరుగులేని రుజువు. తన గడ్డ మీది ఉగ్ర శిబిరాలు తుడిచిపెట్టుకుపోయాయనే నిరాశతో పాక్ దుస్సాహసానికి దిగింది. ఉగ్ర పోరులో మనతో కలిసి రావాల్సింది పోయి మనపైనే దాడులకు తెగబడింది. విచక్షణ కోల్పోయి మన సైనిక స్థావరాలతో పాటు విద్యా సంస్థలు, ప్రార్థనాలయాలు, ఇళ్లను కూడా లక్ష్యం చేసుకుంది. కానీ ఆ ప్రయత్నంలో ఘోరంగా విఫలమైంది. పాక్ డ్రోన్లు, క్షిపణులను మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఎక్కడివక్కడ నేలకూల్చింది. మనం అంతటితో ఆగలేదు. వాళ్లు సరిహద్దులపై దాడి చేస్తే నేరుగా పాక్ గుండెకాయకే గురిపెట్టాం. ప్రధాన నగరాల్లోని వాళ్ల కీలక సైనిక, వైమానిక స్థావరాలన్నింటినీ నేలమట్టం చేశాం. పాక్ సైన్యానికి ఊహించలేనంత నష్టం మిగిల్చాం. ఆ క్రమంలో మన బలగాలు అంతులేని సామర్థ్యాన్ని, సంయమనాన్ని ఏకకాలంలో అద్భుత రీతిలో ప్రదర్శించాయి. మన దేశీయ ఆయుధ వ్యవస్థ తాలూకు పాటవాన్ని పూర్తిస్థాయిలో రుచిచూపాయి. దాంతో బెంబేలెత్తిపోయి దాయాది కాళ్లబేరానికొచ్చింది. ఎలాగోలా పరువు కాపాడుకునే ప్రయత్నాలకు దిగింది. కాపాడండంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది. మే 10న మన పాక్ డీజీఎంఓ మన డీజీఎంఓకు కాల్ చేశారు. "ఇకపై మా గడ్డపై ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలూ, సైనిక దుస్సాహసాలూ జరగబోవు" అని స్పష్టంగా హామీ ఇచ్చారు. అప్పటికే పాక్ గుండెలపై పుట్టుకొచ్చిన ఉగ్ర తండాలన్నింటినీ మనం నేలమట్టం చేయడమే గాక దాని పీచమణచాం. కనుక వారి అభ్యర్థనపై ఆలోచించాం. అయినా కాల్పులకు కేవలం విరామం మాత్రమే ఇచ్చాం. ఎలాంటి కవ్వింపులకు దిగినా పాక్‌కు మరోసారి బుద్ధి చెప్పేందుకు మన సైన్యం, వైమానిక, నావికా దళాలు, బీఎస్ఎఫ్ సర్వ సన్నద్ధంగా ఉన్నాయి.

ఉగ్రవాదాన్ని ఇకముందు ఏమాత్రమూ సహించేది లేదు. మన ఐక్యతే దానికి మరణశాసనం. అదే మన అతిపెద్ద శక్తి. ఇది యుద్ధాల యుగం కాదు. నిజమే. కానీ ఉగ్రవాద యుగం కూడా కాదని ప్రపంచమంతా ఒక్కతాటిపైకి వచ్చి స్పష్టమైన సందేశమివ్వాలి. 21వ శతాబ్దపు అధునాతన యుద్ధ రీతులతో ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే మెరుగైన సమాజానికి బాటలు పరిచిన వాళ్లమవుతాం." ఉగ్రవాదంపై భారత వైఖరి సుస్పష్టమని మోదీ చెప్పారు. "ఉగ్రవాదం, వాణిజ్యం, చర్చలు ఏకకాలంలో కొనసాగలేవు. నీళ్లు, రక్తం కలసికట్టుగా పారడం జరగని పని" అని స్పష్టం చేశారు. తద్వారా ఉగ్రవాదానికి పాక్ పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేదాకా ఆ దేశంపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు, సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తదితర చర్యలు కొనసాగుతాయని చెప్పకనే చెప్పారు. "ఉగ్రవాదాన్ని ఆపాల్సిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించి తీరాల్సిందే. పాక్‌తో ఏ చర్చలైనా కేవలం ఈ రెండు అంశాలపైనే జరుగుతాయి. పాక్‌తో పాటు ప్రపంచ దేశాలకు కూడా ఈ విషయం స్పష్టం చేస్తున్నా" అంటూ ప్రధాని కుండబద్దలు కొట్టారు. "నేను బుద్ధపూర్ణిమ. ప్రపంచానికి బుద్ధుడు చూపిన శాంతిమార్గం కూడా శక్తి గుండానే సాగుతుంది" అని మోదీ స్పష్టం చేశారు. 'ప్రతి భారతీయుడూ శాంతియుతంగా జీవించాలి. వికసిత భారత స్వప్నం సాకారం కావాలి. అందుకు భారత్ శక్తిమంతమైన దేశంగా మారడం తప్పనిసరి. ఆ శక్తిని అవసరమైనప్పుడు ప్రదర్శించి చూపాలి. గత కొద్ది రోజులుగా మనం చేసింది సరిగ్గా అదే. ఆ యజ్ఞంలో భాగస్వాములైన సైనిక బలగాలకు, నిఘా వర్గాలకు, శాస్త్రవేత్తలకు అందరికీ ప్రతి భారతీయుని తరఫునా నా సెల్యూట్.

# అంజయ్య నగర్ లో మహిళలపై కబ్జాదారుల దాడి



అంజయ్య నగర్ లో మహిళలపై దాడి చేస్తున్న దృశ్యం



అంజయ్య నగర్ లో మహిళలపై దాడి చేస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : హైటెక్ సిటీ పరిధిలోని అంజయ్య నగర్ లో కబ్జాదారులు మరోసారి రెచ్చిపోయారు. ఓ ఇంటి మీద దాడి చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కబ్జాదారులను అడ్డుకున్న మహిళలపై దాడి చేసి గాయపరిచారు. తమ మీద జరిగిన దాడిపై మహిళలు రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అంజయ్య నగర్ లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాధితుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి..

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వేనెంబర్ 136లో గల అంజయ్య నగర్ లో ముత్తోజు మధు అనే వ్యక్తి తన కుటుంబంతో గత 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు. మధు సదరు స్థలంలో నిర్మించుకున్న ఇంటికి జిహెచ్ఎంసి నుంచి ఇంటి నెంబరు 209/136/1/ఏ ను పొందడంతో పాటు విద్యుత్ కనెక్షన్, మంజీర నీటి కనెక్షన్ పొందాడు. కాగా వీరి ఇంటి ఎదురుగా ఉండే షేక్ రహీం, చాంద్ పాషా లు కొన్ని రోజుల క్రితం సదరు స్థలం తమదంటూ వచ్చారు. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి తమ స్థలం కబ్జాకు యత్నించారని బాధితులు వాపోయారు. ఒకసారి ఇతరుల వద్ద నుంచి కొనుగోలు చేశామని... మరోసారి శేరిలింగంపల్లి రెవెన్యూ కార్యాలయం తమకు పట్టా మంజూరు చేసిందంటూ ఆక్రమించేందుకు ప్రయత్నించారని అన్నారు. మధు ఇంట్లో లేని సమయంలో ఇంటి మీద దాడి చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించగా షేక్ రహీం చాంద్ పాషాల మీద రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు గతంలో కేసు నెంబర్ 283/2025 కేసు నమోదు చేశారని బాధితులు తెలిపారు. అనంతరం కబ్జాదారులు కోర్టుకు వెళ్లడంతో ప్రస్తుతం వివాదం కోర్టులో ఉందన్నారు. కాగా సోమవారం సాయంత్రం మధు ఇంట్లో లేని సమయంలో షేక్ రహీం, అతని భార్య, షేక్ చాంద్ పాషా, అతని భార్య కలిసి ఒక్కసారిగా మధు ఇంటిపై దాడి చేశారని ఇంటిని కూల్చివేసేందుకు ప్రయత్నించగా.. మధు భార్య నిర్మల, కుమార్తె అమనిలు వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో రహీం, చాంద్ పాషా, వారి అనుచరులు కలిసి నిర్మల, ఆమనిల మీద దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారు. ఈ విషయమై బాధితులు డయల్ 100 కు ఫోన్ చేయగా రాయదుర్గం పోలీసులు సంఘటనస్థలికి చేరుకొని ఇరువర్గాలను పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు. తమపై జరిగిన దాడిపై ఆమని, నిర్మలలు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల పిర్యాదును స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు: ఆర్మీ మాజీ చీఫ్



**యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదని, ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.**

పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణె.. కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. ''యుద్ధం వల్ల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే పౌరుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. షెల్లింగ్‌ను చూడగానే చిన్న పిల్లలు సైతం రాత్రి పూట సురక్షిత ప్రాంతాలకే పరిగెత్తాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రియమైన వారిని కోల్పోతే ఆ ఆవేదన తరతరాలను వెంటాడుతుంది'' అని ఆర్మీ మాజీ చీఫ్ తెలిపారు.

పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్.. దెబ్బకు దిగి వచ్చి కాల్పుల విరమణకు అంగీకారం''యుద్ధం అంత రొమాంటిక్‌గా ఉండదు. ఇదేం బాలీవుడ్ సినిమా కాదు. చాలా తీవ్రమైన అంశం. యుద్ధం అనేది మనం ఎంచుకునే చివరి అవకాశంగా ఉండాలి. అందుకే ప్రధాని మోదీ ఇది యుద్ధాల శకం కాదని చెప్పారు. తెలివితక్కువ వాళ్ల వల్ల బలవంతంగా యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా.. దాన్ని నివారించేందుకే మనం మొగ్గు చూపాలి. ఇప్పుడు చాలామంది పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు. సైన్యంలో పనిచేసిన వ్యక్తిగా.. యుద్ధానికి వెళ్లేందుకు నేను సిద్ధమే. కానీ, దౌత్యాన్ని తొలి అవకాశంగా ఎంచుకుంటా. చర్చలతోనే సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటా'' అని నరవణే వ్యాఖ్యానించారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవం



నర్సులను సన్మానిస్తున్న దృశ్యం

**కనిపించే దేవుళ్ళు వైద్యులైతే...కాపాడే దేవతలు నర్సులు...**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి లో గల పద్మ అపార్ట్మెంట్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నర్సులను ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి, క్రొవ్వొత్తి వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆచార్య అధర్ హబీబ్ సిద్ధిఖి, సత్యసాయి సేవా సమితుల కన్వీనర్ బిసీ.రామన్న, సంఘ సేవకులు ఈ. దేవానంద్ యాదవ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 12వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం 'మన నర్సులు మన భవిష్యత్తు' అనే నినాదంతో నిర్వహిస్తున్నారన్నారు. మానవులకు సేవ చేయడానికి భగవంతుడు కల్పించిన అవకాశమే వైద్య రంగమని, దీనిలో ప్రధానమైనది నర్సింగ్ వృత్తి అని తెలిపారు. రోగులకు వైద్యులు ఇచ్చే ఔషదం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవకూడా అంతే ముఖ్యమని అన్నారు. వైద్య రంగంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆమె జన్మదినాన్ని నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆసుపత్రుల్లో సేవ చేస్తున్న నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, అమ్మయ్య చౌదరి, కొండల్ రెడ్డి, బాలరాజు, విజయలక్ష్మి, నాగమణి, జీవి రావు, సత్యనారాయణ, ప్రేమ్ సింగ్, జిల్ మల్లేష్, ఖాదర్ మొయినుద్దీన్, శివపామిరెడ్డి, ఇమామ్, పాండు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు..

ఈ కబురు: ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అణుస్థావరాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ అసత్య ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. ''పాకిస్థాన్ తన అణ్వాయుధాలను కిరానా హిల్స్ వద్ద నిల్వ చేస్తుందని చెప్పినందుకు థ్యాంక్స్. అక్కడ ఏమైనా ఉండనీ.. మేం మాత్రం ఆ హిల్స్‌ను టార్గెట్ చేయలేదు. మేం లక్ష్యంగా చేసుకున్నామని చెప్పిన జాబితాలో అది లేదు'' అని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ అణుస్థావరంపై దాడి గురించి అనేక వార్తలు చక్కర్లు కొట్టాయి. అణ్వాయుధాలను నిల్వచేసి ఉండొచ్చని చెప్తున్న హిల్స్.. సర్గోధా వైమానిక స్థావరానికి దగ్గర ఉన్నాయని వాటి సారాంశం. ఆ వైమానిక స్థావరాన్ని భారత్ టార్గెట్ చేసినట్లు మన సైన్యం ధ్రువీకరించగానే ఆ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. పాక్‌లో ఇటీవల సంభవించిన భూకంపాలకు.. అణు నిల్వలు ఉంచిన ప్రదేశాన్ని ఢీకొట్టడానికి ముడిపెట్టిన సిద్ధాంతాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికి తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకే భారతి చెక్ పెట్టారు. పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

# ఏఐజీ చైర్మన్ ను కలిసిన శ్రీని ఇన్ఫ్రా అధినేత శ్రీనివాసరావు




నాగేశ్వరరెడ్డిని కలిసిన శ్రీనివాస రావు

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్న ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్ రెడ్డిని సోమవారం శ్రీని ఇన్ఫ్రా అధినేత శ్రీనివాస రావు మర్యాదపూర్వకంగా కలిశారు. దేశ అత్యున్నత పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా నాగేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీని ఇన్ఫ్రా అధినేత శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగేశ్వరరెడ్డి వైద్య రంగంలో చేసిన విశిష్ట సేవలకు దేశం చేసిన వందనం పద్మ విభూషణ్ పురస్కారమని అన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయులు నాగేశ్వర రెడ్డి అని తెలిపారు. దేశంలో మూడు పద్మ పురస్కారాలను అందుకున్న ఏకైక వైద్యుడిగా నాగేశ్వరరెడ్డి చరిత్ర సృష్టించాడని అన్నారు. తెలుగు ప్రజల ఖ్యాతి, తెలుగు వైద్యుల గొప్పదనాన్ని మరోసారి దేశానికి తెలిసేలా చేశారన్నారు. ఏఐజీ ఆసుపత్రిని ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరాన్ని మెడికల్ హబ్ గా మార్చడంలో నాగేశ్వరరెడ్డి తనవంతు పాత్ర పోషించారని, నేడు మన దేశంతో పాటు ప్రపంచ నలుమూలల నుంచి వస్తున్న రోగులకు ఏఐజీ ఆసుపత్రి సేవలు అందిస్తుందని అన్నారు.

## పీవోకేను అప్పగించడంపై తప్ప వేరే చర్చల్లేవ్: భారత్



చైనా తయారు చేసిన పీఎల్ 15 క్షిపణిని నేలకూల్చాం. పాకిస్థాన్‌కు చెందిన అనేక డ్రోన్లు, మిస్సైళ్లను కూల్చివేశాం. ఉగ్రవాదంపై పోరాటంలో పాక్ సైన్యం జోక్యం చేసుకుంటే తిప్పికొట్టాం. కరాచీ సమీపంలోని లక్ష్యాలపైనా దాడులు చేశాం'' అని ఎయిర్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు.

**పటిష్ఠ నిఘాతో దాడులను తిప్పికొట్టాం.. వైస్ అడ్మిరల్ ప్రమోద్**

భారత్ వైపు గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామన్నారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని చెప్పారు. డ్రోన్లు, హైస్పీడ్ మిసైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు పేర్కొన్నారు. ''వందల కి.మీ దూరంలో ఉన్న శత్రుసేనల విమానాలను దగ్గరకు రాకుండా అడ్డుకున్నాం. త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. మన స్వదేశీ ప్రతిస్పందన దాడి వ్యవస్థ చాలా బలమైంది. సైన్యానికి అండగా నిలిచిన 140 కోట్ల మంది ప్రజలకు ధన్యవాదాలు. ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది'' అని వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఉగ్రవాదం తీరులో మార్పు వచ్చిందని.. ఉగ్రవాదులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్మీ డీజీఎంవో రాజీవ్ ఘయ్ అన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై బ్రీఫింగ్.. కోహ్లీ ప్రస్తావన తెచ్చిన ఆర్మీ

ఈ కబురు: పాకిస్థాన్‌పై దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. దాయాది ఆటలు సాగనివ్వకుండా చేశామన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై రక్షణశాఖ అధికారులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి కీలక వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ.. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రస్తావన తెచ్చారు. మన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సామర్థ్యాన్ని ఆస్ట్రేలియా దిగ్గజ ఫాస్ట్ బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ ద్వయంతో పోలుస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఈ రోజు విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఎంతోమంది అభిమానుల్లాగే నాక్కూడా ఆయన ఎంతో ఇష్టమైన క్రికెటర్. అందువల్ల క్రికెట్ గురించి మనం ఇప్పుడు మాట్లాడుకోవచ్చు. 1970ల్లో నేను స్కూల్ రోజుల్లో ఉన్నప్పుడు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య ఓ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ సమయంలో ఆసీస్ మేటి బౌలర్లు జెఫ్ థామ్సన్, డెనిస్ లిల్లీ విధ్వంసం సృష్టించారు. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను ఊచకోత కోశారు. అప్పుడు ఆస్ట్రేలియా ఓ పద ప్రయోగం చేసింది. 'యాషెస్ టు యాషెస్ (బూడిదను ఉద్దేశిస్తూ).. డస్ట్ టు డస్ట్.. థామ్సన్‌కి దొరక్కపోతే.. లిల్లీకి చిక్కాల్సిందే' అని పేర్కొంది. ఇప్పుడు పాకిస్థాన్‌పై పోరులో భారత్ ఆధిపత్యాన్ని అలాగే అభివర్ణించొచ్చు'' అని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ పేర్కొన్నారు. ''మన గగనతల రక్షణ వ్యవస్థలోని దశలను చూస్తే మీకు ఇంకా బాగా అర్థమవుతుంది. శత్రువులు ఎన్ని హద్దులు దాటి వచ్చినా..

# అవును.. మా యుద్ధవిమానం ధ్వంసమైంది: అంగీకరించిన పాకిస్థాన్




**భారత్‌తో జరిగిన ఘర్షణల్లో తమ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైందని పాకిస్థాన్ ఆర్మీ అంగీకరించింది.**

ఈ కబురు: ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని, ఆ దేశ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చామని భారత సైన్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పాకిస్థాన్ ఆర్మీస్పందించింది. తమ ఫైటర్ జెట్ ఒకటి ధ్వంసమైన మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, అది స్వల్పమేనని పేర్కొనడం గమనార్హం. పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. ''భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది'' అని వెల్లడించారు. అయితే, ఆ నష్టం ఏ స్థాయిలో ఉందనే విషయంపై పూర్తి వివరాలను ఆయన బయటపెట్టలేదు.

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సాధించిన విజయాలను మన సైన్యం ఆదివారం వెల్లడించింది. పాక్ విమానాలను నేల కూల్చామని ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి తెలిపారు. అయితే, ఆ సంఖ్య ఎంత అన్నది ఆయన చెప్పలేదు. ''మన సరిహద్దు లోపలికి పాక్ యుద్ధవిమానాలను రాకుండా నిరోధించాం. కాబట్టి వాటి శకలాలు మా దగ్గర లేవు. కాకపోతే కచ్చితంగా కొన్ని విమానాలను కూల్చాం'' అని తెలిపారు.

నేడు కీలక చర్చలు..

ఘర్షణలు సద్దుమణిగిన నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య నేడు డీజీఎంవో కీలక చర్చలు జరగనున్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, మేజరల్ జనరల్ కాషిఫ్ చౌధరీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వివరాలపై వీరు చర్చించనున్నారు.

# సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి వచ్చేయండి: సీఎం ఒమర్ అబ్దుల్లా



అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ''ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతాల ప్రజలు తిరిగి తమ సొంత ఇళ్లకు చేరాలి. ఉద్రిక్తతలతో పూంఛ్ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా, ఈ జిల్లాలో సుమారు 80 నుంచి 90 శాతం వరకు ప్రజలు తమ నివాసాలను ఖాళీ చేశారు. వారు తప్పకుండా తిరిగి రావాలి'' అని సీఎం పేర్కొన్నారు.

కాగా.. ఇటీవల పాక్ కాల్పులతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను సీఎం ఒమర్ పరామర్శించారు. ''పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో దాదాపు 13 మందికి పైగా పౌరులు మృతి చెందారు. బాధితులను పరామర్శించడానికే నేను ఇక్కడికి వచ్చాను. రాష్ట్రంలోని పూంఛ్, రాజౌరి, జమ్మూ, బారాముల్లా, కుప్వారా, బందిపోరా జిల్లాల్లో జరిగిన నష్టాలను అంచనా వేసి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాను. మృతుల కుటుంబాలకు ఈ నివేదిక ప్రకారం నష్టపరిహారం అందిస్తాం. ఉద్రిక్తతల సమయంలో సీనియర్ అధికారులపై వచ్చిన వదంతులను నమ్మొద్దు'' అని ఆయన సూచించారు.



## అమెరికా, చైనా డీల్:
# ఒక్కసారిగా తగ్గిన బంగారం ధరలు

అమెరికా ప్రతీకగా సుంకాల కారణంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోయాయి, బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి. దేశంలో గోల్డ్ రేటు ఏకంగా లక్ష మార్కును దాటేసింది. అయితే తాజాగా జరిగిన అమెరికా చైనా దేశాలను టారిఫ్స్ కొంత తగ్గిస్తున్నట్లు.. ఇవి 90 రోజులు అమల్లో ఉంటాయని ప్రకటించాయి. దీంతో పసిడి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి.

అంతర్జాతీయ మార్కెట్లో 3400 డాలర్ల కంటే ఎగువన ట్రేడ్ అయిన ఔన్స్ బంగారం ధర.. ఏకంగా 3218 డాలర్లకు దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే భారతదేశంలో కూడా గోల్డ్ రేటు గణనీయంగా తగ్గింది. వెండి ధరలు కూడా బంగారం బాటలో పయనించిందా అన్నట్లు.. తగ్గుముఖం పట్టింది. దీంతో దేశం మొత్తం మీద బంగారం, వెండి ధరలు తగ్గినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

అమెరికా దిగుమతులపైన చైనా విధించిన 125 శాతం సుంకాలలో 10 శాతం తగ్గించింది. అదే సమయంలో అమెరికా కూడా చైనా దిగుమతుల మీద విధించిన 145 శాతం సుంకాలలో 30 శాతం తగ్గించింది.

ఇరు దేశాలు (చైనా, అమెరికా) కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. ఈ సుంకాల తగ్గింపు 90 రోజులు మాత్రమే అమలులో ఉంటాయని తెలుస్తోంది. కొత్త సుంకాలు మే 14 నుంచి అమలులోకి రానున్నాయి. ఆ తరువాత తగ్గింపు సుంకాలే కొనసాగుతాయా?, ముందుకు విధించిన సుంకాలు కొనసాగుతాయా?, అనే విషయం తెలియాల్సి ఉంది.






# టీసీఎస్ కొత్త ఆఫీస్:
# నెల అద్దె ఎన్ని కోట్లంటే..

**దిగ్గజ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ చెన్నైలోని ఓజోన్ టెక్నో పార్క్‌లో దాదాపు 6,30,000 చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. దీనికి నెలవారీ అద్దె రూ. 2.8 కోట్లు అని.. రియల్ ఎస్టేట్ డేటా అనలిటికల్ సంస్థ ప్రాప్‌స్టాక్ ద్వారా తెలిసింది.**

చెన్నైలోని నవలూర్‌లో టీసీఎస్.. ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. అద్దె 2025 మార్చి 15 నుంచి ప్రారంభం కానుంది. ఈ స్థలాన్ని ప్లాటినం హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 10 సంవత్సరాలకు లీజుకు తీసుకుంది. దీని కోసం టీసీఎస్ రూ. 25.5 కోట్లు డిపాజిట్ చేసినట్లు సమాచారం. అద్దె నెలకు చదరపు అడుగుకు రూ. 45 చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే ప్రతి మూడు సంవత్సరాల తర్వాత అద్దె 12 శాతం పెరుగుతుంది. అయితే ఈ విషయంపై టీసీఎస్ అధికారికంగా స్పందించలేదు.

చెన్నైలో ఇతర వాణిజ్య రియల్ ఎస్టేట్ లావాదేవీలు

- జనవరి 2025లో వాల్మార్ట్.. చెన్నైలో 4.6 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని నెలకు రూ. 3.26 కోట్ల అద్దెకు లీజుకు తీసుకున్నట్లు ప్రాప్‌స్టాక్ యాక్సెస్ చేసిన పత్రాల ద్వారా తెలిసింది. ఈ ఆఫీస్ స్థలం ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో ఉంది. కంపెనీ దీనికోసం రూ.19.55 కోట్లు డిపాజిట్ చేసింది.
- మార్చిలో, కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా.. చెన్నైలోని తన ఇండియా ప్రధాన కార్యాలయాన్ని బాగ్మనే కన్‌స్ట్రక్షన్స్‌కు రూ. 612 కోట్లకు విక్రయించింది. ఈ ఆస్తి చెన్నైలోని ఓల్డ్ మహాబలిపురం రోడ్ లోని తోరైపక్కంలో ఉంది. ఇది నగరంలోని కీలకమైన ఐటీ కారిడార్‌లలో ఒకటి. ఈ ఒప్పందాన్ని మధ్యవర్తిత్వం వహించిన జేఎల్ఎల్ ధృవీకరించింది.
- గత ఏడాది ఆగస్టులో, ఐటీ సేవల దిగ్గజం LTI మైండ్‌ట్రీ.. చెన్నైలోని మనపక్కం శివారులో 5.85 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని రూ.3.98 కోట్ల నెలవారీ అద్దెకు లీజుకు తీసుకుంది.

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,950.34 పాయింట్లు లేదా 3.71 శాతం లాభంతో 82,404.81 వద్ద, నిఫ్టీ 912.80 పాయింట్లు లేదా 3.80 శాతం లాభంతో 24,920.80 వద్ద నిలిచాయి. చాల రోజుల తరువాత భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లో క్లోజ్ అవ్వడం బహుశా ఇదే మొదటిసారి.

ఎన్డీఆర్ ఆటో కాంపోనెంట్స్, ఇన్స్పిరిసిస్ సొల్యూషన్స్, ఐఎఫ్బీఎల్ రిఫ్రాక్టరీస్, బిర్లా కార్పొరేషన్, మ్యాన్ ఇండస్ట్రీస్ (ఇండియా) వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. కేపీఆర్ మిల్, జిందాల్ వరల్డ్‌వైడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.




## జియో కొత్త రీఛార్జ్ ప్లాన్స్:
# 365 రోజుల వ్యాలిడిటీ కోసం..





**టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల అన్ని టెలికాం ఆపరేటర్లను వినియోగదారుల ప్రయోజనం కోసం.. వాయిస్ కాలింగ్, ఎస్ఎమ్ఎస్ సేవలను కలిగి ఉన్న సరసమైన రీఛార్జ్ ప్లాన్‌లను అందించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలకు ప్రతిస్పందనగా, రిలయన్స్ జియో ఎటువంటి డేటా ప్రయోజనాలను అందించకుండా.. కాలింగ్, ఎస్ఎమ్ఎస్ వంటి వాటికోసం మాత్రమే రెండు బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది. రిలయన్స్ జియో ప్రవేశపెట్టిన ఈ కొత్త ప్లాన్‌లు (రూ.458, రూ.1958) ప్రత్యేకంగా వాయిస్ కాల్స్ & టెక్స్ట్ మెసేజస్ వంటివి మాత్రమే అవసరమయ్యే వారికి ఉపయోగపడతాయి. అంటే ఈ ప్లాన్‌లలో డేటా లభించదు.**

**రూ.458 ప్లాన్**

**ఈ ప్లాన్ వ్యాలిడిటీ 84 రోజులు మాత్రమే ఉంటుంది. వ్యాలిడిటీ సమయంలో అపరిమిత వాయిస్ కాలింగ్, 1000 ఎస్ఎంఎస్‌లు, నేషనల్ రోమింగ్ వంటివి లభిస్తాయి. అంతే కాకుండా.. జియో సినిమా, జియో టీవీ, జియోకు సంబంధించిన యాప్‌లను యాక్సెస్ చేయవచ్చు.**

**రూ. 1,958 ప్లాన్**

**ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇందులో అపరిమిత వాయిస్ కాల్స్, 3,600 ఎస్ఎంఎస్‌లు, నేషనల్ రోమింగ్ సేవలు ఉన్నాయి. వీటితో పాటు.. వినియోగదారులు జియో సినిమా, జియో టీవీ యాక్సెస్‌ను పొందుతారు. కొత్త ప్లాన్‌ల తీసుకొచ్చిన జియో.. రూ. 479, రూ. 1899 ప్లాన్‌లను నిలిపివేసింది.**



# ఐఫోన్ అంతరించనుందా..?

**ఏఐ ఆధారిత టెక్నాలజీలు చివరికి స్మార్ట్‌ఫోన్ల స్థానాన్ని భర్తీ చేయగలవని, వినియోగదారులు వ్యక్తిగత పరికరాలతో సంభాషించేలా ఈ సాంకేతికతలు కీలక మార్పులు తెస్తాయని యాపిల్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎడ్డీ క్యూ తెలిపారు. వచ్చే దశాబ్ద కాలంలో ఐఫోన్ లభ్యతపై ఈ ప్రభావం ఉండనుందని చెప్పారు. ఇటీవల యాంటీట్రస్ట్ ట్రయల్ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.**

**‘ఐపాడ్ ఒకప్పుడు మ్యూజిక్ వినియోగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఐఫోన్లు అందుబాటులోకి వచ్చాక క్రమంగా వాటి వినియోగం తగ్గిపోయింది. చివరకు ఐపాడ్‌లను నిలిపేయాల్సి వచ్చింది. ప్రస్తుతం స్మార్ట్‌వాచ్‌లు, నెక్స్ట్ జనరేషన్ ఎయిర్‌పాడ్‌లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి ఏఐ-ఆధారిత ప్రత్యామ్నాయాలు మనం కమ్యూనికేట్ చేసే సమాచారాన్ని యాక్సెస్ చేసే విధానం మారుతుంది. ఈ మార్పు రానున్న రోజుల్లో ఐఫోన్లను రిప్లేస్ చేసే అవకాశం ఉంది’ అని ఎడ్డీ క్యూ తెలిపారు.**

**యాపిల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలు**

**‘వచ్చే తరం కంప్యూటింగ్‌లో ముందుండాలనే లక్ష్యంతో యాపిల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్నాలజీలను అన్వేషిస్తోంది. మెటా వంటి కంపెనీలు ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), ఏఐ ఇంటిగ్రేటెడ్ వేరబుల్స్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. సాంప్రదాయ స్మార్ట్‌ఫోన్లకు మించి మెరుగైన సామర్థ్యం, అంతరాయం లేని కనెక్టివిటీని ఈ టెక్నాలజీలు అందించే అవకాశం ఉంది. వాయిస్ కంట్రోల్డ్ అసిస్టెన్స్, రియల్-టైమ్ కాంటెక్స్‌ట్‌వల్ అవేర్‌నెస్, అడాప్టివ్ ఏఐ ఆధారిత ఇంటర్ఫేస్ వంటి ఆవిష్కరణలు వచ్చే రోజుల్లో ప్రామాణికంగా మారవచ్చు’ అని క్యూ అన్నారు.**

**యాపిల్ విజన్**

**‘ఐఫోన్ యాపిల్‌కు భారీగా ఆదాయాన్ని సమకూరుస్తున్నప్పటికీ భవిష్యత్తులో కంపెనీ దీనికి ప్రత్యామ్నాయాన్ని సృష్టించేందుకు సిద్ధం అవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఆర్, స్మార్ట్ డివైజ్ ఎకోసిస్టమ్స్‌లో యాపిల్ సాధించిన పురోగతితో కంపెనీ వ్యూహాత్మకంగా తదుపరి తరం కంప్యూటింగ్‌లో ముందంజలో ఉంది’ అని క్యూ చెప్పారు.**

# నయన్ భర్త కొత్త చిత్రం.. రిలీజ్ డేట్ ఎప్పుడంటే..?





నటి నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ రూపొందిస్తోన్న చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' . ఈ సినిమా రిలీజ్ డేట్‌ను తాజాగా చిత్రబృందం ప్రకటించింది.

నటి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'ఎల్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి హీరోహీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 2023లో పట్టాలెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న దీనిని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. అనిరుధ్ స్వరాలు అందిస్తున్నారు.

**వివాదాలు ఎదుర్కొని..!**

ఈ సినిమా విషయంలో విఘ్నేశ్ శివన్ పలు వివాదాలు ఎదుర్కొన్నారు. తొలుత ఈ చిత్రాన్ని నటుడు శివకార్తికేయన్‌తో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై చేస్తున్నట్లు 2019లో వార్తలు వచ్చాయి. అనివార్య కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలోనే 2023లో ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేశ్ శివన్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. మొదట ఈ చిత్రానికి 'ఎల్ఐసీ' (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) అనే టైటిల్ పెట్టారు. దీంతో ఎల్ఐసీ సంస్థ చిత్రబృందానికి నోటీసులు జారీ చేసింది. తమ సంస్థకు ప్రజల్లో మంచి పేరు ఉందని.. సినిమా కోసం ఈ టైటిల్‌ను ఉపయోగిస్తే సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. వారం రోజుల్లోగా పేరు మార్చకపోతే లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈనేపథ్యంలోనే తమ సినిమా టైటిల్‌ను 'ఎల్ఐసీ' నుంచి 'ఎల్ఐకే'గా మార్చారు. ప్రస్తుతం ఇది సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై నిర్మితమవుతోంది.



## పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి తొలి సినిమా.. లేటేస్ట్ అప్‌డేట్ ఇదే!

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం సతీ లీలావతి. ఈ సినిమాకు భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా సతీ లీలావతి డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వరుణ్‌తేజ్‌తో పెళ్లి తర్వాత మెగా కోడలిగా లావణ్య త్రిపాఠి నటిస్తోన్న మొదటి చిత్రం కావడం విశేషం. భార్యాభర్తల మధ్య ప్రేమానుబంధాలను తెలియజేస్తూ ఎమోషనల్ అంశాలతో సతీ లీలావతి సినిమాను రూపొందిస్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనుకున్న ప్లానింగ్ ప్రకారం మేకర్స్ సినిమాను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. వీలైనంత త్వరగా షూటింగ్ చేసి సమ్మర్ కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఫీల్ గుడ్ మూవీగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి మిక్కీ జే మేయర్ సంగీతమందిస్తున్నారు.





# మిత్రమా.. మళ్లీ జన్మించు: 'కాంతార 2' నటుడి మృతిపై రిషబ్‌శెట్టి

నటుడు రాకేశ్ పూజారి (34) మృతి పట్ల 'కాంతార 2' హీరో రిషబ్‌శెట్టి, నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రతినిధులు సంతాపం వ్యక్తంచేశారు.

నటుడు రాకేశ్ పూజారి (34) మృతి పట్ల 'కాంతార 2' హీరో రిషబ్‌శెట్టి, నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. "రాకేశ్ పూజారి మరణించారన్న వార్త కలచివేసింది. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఈ కష్టకాలం నుంచి ఆ కుటుంబం త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

మిత్రమా.. మళ్లీ జన్మించు: రిషబ్‌శెట్టి

'మిత్రమా.. మళ్లీ జన్మించు' అంటూ నటుడు రిషబ్‌శెట్టి ఎమోషనల్ పోస్టు పెట్టారు. "'కాంతార'లోని నీ పాత్ర, ఆ క్యారెక్టర్‌ను పెర్ఫామ్ చేసే క్రమంలో నీ ముఖంపై చిరునవ్వు ఎప్పటికీ నా మదిలో మెదులుతూనే ఉంటాయి. నీ లోటు మరొకరు తీర్చలేనిది" అని పేర్కొన్నారు. రాకేశ్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

సోమవారం తెల్లవారుజామున రాకేశ్ గుండెపోటుతో మరణించినట్టు కన్నడ నటుడు శివరాజ్ కేఆర్ తెలిపారు. కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఓ మెహందీ వేడుకలో పాల్గొన్న రాకేశ్.. డ్యాన్స్ చేస్తుండగా కుప్పకూలిపోయారు. టెవిలిజన్ షో 'కామెడీ ఖిలాడిగలు' సీజన్ 3 విజేతగా నిలిచి, మంచి గుర్తింపు తెచ్చుకున్న రాకేశ్.. కన్నడ, తుళు భాషల్లోని పలు సినిమాల్లో నటించారు. 'కాంతార 2'లోని పాత్ర చిత్రీకరణను ఇటీవల పూర్తి చేసినట్టు సమాచారం.

హిట్ మూవీ 'కాంతార'కు ప్రీక్వెల్ 'కాంతార 2'. స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తున్న చిత్రమిది. ఈ సినిమాకి పని చేసిన జూనియర్ ఆర్టిస్ట్ ఒకరు కొన్ని రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. సినిమా సెట్స్‌లోనే ఆర్టిస్ట్ మరణించాడంటూ వార్తలు రాగా చిత్ర బృందం వాటిని ఖండించింది. అతడు చనిపోయిన రోజు.. సినిమా చిత్రీకరణ లేదని చెప్పింది.

# నేను పొగడలేదు.. కోప్పడ్డా: సిరివెన్నెలపై స్పీచ్ గురించి త్రివిక్రమ్



**సిరివెన్నెలను ఉద్దేశించి గతంలో తాను ఇచ్చిన ప్రసంగంపై దర్శకుడు త్రివిక్రమ్ స్పందించారు. 'నా ఉచ్ఛ్వాసం కవనం' కార్యక్రమంలో మాట్లాడారు.**

పాటల రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని ఉద్దేశించి కొన్నాళ్ల క్రితం ఓ వేడుకలో దర్శకుడు త్రివిక్రమ్ ఇచ్చిన స్పీచ్ వైరల్ అయిన సంగతి తెలిసిందే. 'నా ఉచ్ఛ్వాసం కవనం' కార్యక్రమానికి హాజరైన ఆయన ఆ ప్రసంగంపై స్పందించారు. ఆ రోజు తాను సిరివెన్నెలను పొగడలేదని, ఆయనపై కోప్పడ్డానని అన్నారు. 'ఈటీవీ'లో ప్రసారమవుతున్న కార్యక్రమం ఇది. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు.. సిరివెన్నెలతో తమకున్న అనుబంధాన్ని పంచుకోగా తాజా ఎపిసోడ్‌లో త్రివిక్రమ్ పలు విశేషాలు పంచుకున్నారు. "చాలామంది ఆయన్ను ప్రశంసించానని అనుకున్నారు. కానీ, నేను పొగడలేదు. పొగడ్తలో కొంచెం డ్రామా, కొంచెం అతిశయోక్తి ఉంటాయి. నేను నిజమే మాట్లాడా. అందుకే ఆ ప్రసంగం ఎక్కువ మందికి నచ్చింది. సినిమా స్థాయిని ఆయన పెంచారు. సినిమా పాట వల్ల అక్కడే బందీ అయిన వ్యక్తి. అందరికీ అర్థం అయ్యేలా చెప్పాల్సి రావడం కవికి శిక్ష. మేం కలిసినప్పుడు ఎన్నో అంశాల గురించి చర్చించుకునేవాళ్లం. విషయం ఏదైనా లోతుగా ఆలోచిస్తారు. ఆయన వ్యాసాలు రాసేవారని చాలామందికి తెలియదు. 'చిలకా ఏ తోడు లేక'లాంటి పాటలను ఆయన అలవోకగా రాసేవారు. ఆయన ఇంకా ఎంతో చేయగలిగిన వ్యక్తి. కానీ, అప్పట్లో అవకాశాలు, తెలుగు సినిమా పరిధి తక్కువ. ఆయన విషయంలో నాకు ఇలా బాధ, కోపం ఉండేవి. దానినే ఆ రోజు చూపించా'' అని వివరించారు. "ఎంత పెద్ద విషయాన్ని అయినా ఒక్క లైన్‌లో చెప్పేవారు. అందుకు నిదర్శనం 'కృష్ణుడు లేని కురుక్షేత్రమున సాగే ఈ సమరం.. నెత్తుటి సిందూరం' (సిందూరం సినిమాలోని అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని పాట).

ఆయన రాసిన పాటల్లో నాకు 'ఆకాశం తాకేలా' (నువ్వొస్తానంటే నేనొద్దంటానా చిత్రంలోది) బాగా ఇష్టం. ఆయన ఆ పాట రాయడం పూర్తయిన వెంటనే నాకు ఫోన్ చేసి, పాడి వినిపించారు. మనం తేలిగ్గా తీసుకునే భావాలకు ఉన్న అసలైన బరువును చూపిస్తారు. ప్రేమ అంటే ఆధ్యాత్మిక భావన కలిగేలా పాటలతో చెప్పే ప్రయత్నం చేశారు. భవిష్యత్తులో ఆయన పాటలను ఇంకా ఎక్కువగా వింటారనే నమ్మకం నాకుంది. మేం బంధువులుగా ఎప్పుడూ ఫీలవలేదు. నేను ఆయన్ను సర్ అంటే ఆయన నన్ను శ్రీను అని పిలిచేవారు'' అని నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.





# సంక్రాంతి వస్తున్నాం మూవీ.. అవార్డ్ కొట్టేసిన బ్యూటీ!

హీరో వెంకటేశ్‌తో పాటు మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ లీడ్ రోల్స్‌లో నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ ఏడాది జనవరి 14న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 310 కోట్లకు పైగానే రాబట్టింది. వెంకీమామ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీలో కోలీవుడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేశ్ తన అమాయకమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. వెంకటేశ్ భార్యగా తనదైన స్టైల్లో అభిమానులను మెప్పించింది. గోదారి గట్టు మీద రామచిలకవే... గోరింటాకెట్టుకున్న చందమామవే అంటూ సాగే సాంగ్‌లో ఐశ్వర్య రాజేశ్ అదరగొట్టింది. ఈ మూవీలో తన నటనకు గానూ ఐశ్వర్య రాజేశ్ క్రేజీ అవార్డ్‌ను సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో అందించే ప్రముఖ అప్సర అవార్డ్ ఐశ్వర్య రాజేశ్‌ను వరించింది. ఈ ఏడాది ఉత్తమ నటిగా ఐశ్వర్య రాజేశ్ అవార్డ్ అందుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి గొప్ప పాత్రను ఇచ్చినందుకు అనిల్ రావిపూడిని ప్రశంసించారు.



## కోహ్లీ రిటైర్మెంట్.. 12 ఏళ్ల నాటి సంఘటనను గుర్తు చేసుకున్న సచిన్

విరాట్ కోహ్లీ టెస్టులకు సచిన్ తెందూల్కర్ స్పందించాడు.

టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీటెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు కోహ్లీ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ క్రీడా ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ విరాట్ టెస్టులకు గుడ్ బై చెప్పడంపై స్పందించాడు. యువ క్రికెటర్లు తమ కలలను సాకారం చేసుకునేలా స్ఫూర్తినిచ్చే వారసత్వాన్ని కోహ్లీ నిర్మించాడని కొనియాడాడు. అంతేకాకుండా 12 ఏళ్ల క్రితం జరిగిన ఓ సంఘటను సచిన్ గుర్తు చేసుకున్నాడు. తన చివరి టెస్టు మ్యాచ్ రోజు కోహ్లీ చేసిన పనిని ఎప్పటికీ మర్చిపోలేనని సచిన్ పేర్కొన్నాడు.

‘కోహ్లీ.. నువ్వు టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో నాకు అద్భుతమైన సంఘటన గుర్తుకొచ్చింది. 12 ఏళ్ల క్రితం నా చివరి టెస్టు సందర్భంగా నువ్వు మీ దివంగత తండ్రి ఇచ్చిన ఓ దారాన్ని ఇచ్చేందుకు ప్రయత్నించావు. అది నీకు వ్యక్తిగతమైనది కావడంతో స్వీకరించలేకపోయాను. అయితే, నువ్వు అలా చేయడం నా హృదయాన్ని హత్తుకుంది. నా మనసులో చిరస్థాయిగా నిలిచిపోయింది. అలాంటి దారాన్ని నేను ఇవ్వలేను. దయచేసి నా అభిమానాన్ని, అభినందనలను స్వీకరించండి. ఎంతోమంది యువ క్రికెటర్లు తమ కలలను సాకారం చేసుకునేలా స్ఫూర్తినిచ్చే వారసత్వాన్ని నిర్మించావు. నీ కెరీర్ అద్భుతంగా సాగింది. భారత క్రికెట్‌కు ఎంతో సేవ చేశావు. నీ అద్భుతమైన టెస్టు కెరీర్‌కు అభినందనలు’ అని సచిన్ ఎక్స్ (ట్విటర్)లో పోస్టు పెట్టాడు. 2013లో వాంఖడే వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో సచిన్ టెస్టులకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.



## నిన్ను మిస్సవుతున్నా.. కోహ్లీ రిటైర్మెంట్‌పై గంభీర్

సుదీర్ఘ ఫార్మాట్ నుంచి విరాట్ కోహ్లీ తన రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ, ఐసీసీతోపాటు పలువురు క్రికెటర్లు సోషల్ మీడియాలో తమ స్పందనలను తెలియజేశారు.

బీసీసీఐ , ఐసీసీ .. విరాట్ కోహ్లీ రిటైర్‌మెంట్ నిర్ణయంపై స్పందించాయి. టెస్టుల్లో తన 14 సంవత్సరాల కెరీర్‌కు కోహ్లీ సోమవారం ముగింపు పలికాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ.. ఎక్స్ ఖాతాలో స్పందించింది. ‘థ్యాంక్యూ విరాట్ కోహ్లీ. టెస్ట్ క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. కానీ వారసత్వం మాత్రం నిరంతరం కొనసాగనుంది’ అని కీర్తించింది.

**కిరీటం చెక్కు చెదరలేదు**
‘విరాట్ టెస్టు జట్టు నుంచి వైదొలగినా... కిరీటం చెక్కుచెదరలేదు. కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికి, సాటిలేని వారసత్వాన్ని మిగిల్చాడు’ - ఐసీసీ

**నిన్ను మిస్సవుతున్నా**
‘సింహంలాంటి మనిషీ.. నేను నిన్ను మిస్సవుతున్నా...!’ - గౌతమ్ గంభీర్ (Gautam Gambhir)

**నువ్వు ప్రత్యేకమైన వ్యక్తివి**
‘విరాట్‌కు అభినందనలు. నిన్ను చూసినప్పటి నుంచి నువ్వు ప్రత్యేకమైన వ్యక్తివని తెలుసు. టెస్ట్ క్రికెట్ ఆడిన తీరు, అందులోని ఉత్సాహం చూడటానికి చాలా ఆనందంగా ఉంది. నువ్వు టెస్ట్ క్రికెట్‌కు గొప్ప రాయబారివి, వన్డే క్రికెట్‌లో నీకు మంచి జరగాలని కోరుకుంటున్నాను’ - వీరేంద్ర సెహ్వాగ్

**అతడు నిజమైన టార్చ్ బేరర్**
‘కోహ్లీ నాకు ఆదర్శం, టెస్ట్ క్రికెట్‌లో అతడి ఆధిపత్యం చూస్తూ పెరిగాను. విరాట్ చేతుల మీదుగా నేను నా టెస్ట్ క్యాప్ అందుకోబోతున్నా అని తెలిసి నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. క్యాప్ నంబర్ 315, నితీష్ రెడ్డి.. ఈ మాటలు నా హృదయంలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తాయి. టెస్ట్ క్రికెట్లో మీరు నిజమైన టార్చ్ బేరర్. నీతో మైదానంలో కలిసి పంచుకున్న క్షణాలను నేను ఎల్లప్పుడూ విలువైనవిగా భావిస్తాను’ - నితీశ్ కుమార్ రెడ్డి

**‘నువ్వు హృదయంతో ఆడావు’**
‘అద్భుతంగా టెస్ట్ కెరీర్‌ను సాగించిన విరాట్ కోహ్లీకి అభినందనలు. టీ20 క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న సమయంలో స్వచ్ఛమైన టెస్ట్ ఫార్మాట్‌లో నువ్వు చక్కటి నిబద్ధత, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ చాటావు. లార్డ్స్‌లో నీ ప్రసంగం అంతా చెప్పింది. నువ్వు టెస్ట్ మ్యాచ్‌లను హృదయంతో, దృఢ సంకల్పంతో ఆడావు’



# టెస్టులకు విరాట్ కోహ్లీ గుడ్‌బై..

**రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ క్రికెటర్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.**

ఇంగ్లాడ్ పర్యటనకు ముందు క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. స్టార్ క్రికెటర్, మాజీ సారథి విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే అతడు కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. తాను కూడా టెస్టుల నుంచి రిటైరవ్వాలనుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐ కి చెప్పిన కోహ్లీ.. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన చేశాడు.

“14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇంత దూరం తీసు కెళ్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉంటాయి”

“అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా. వెనక్కి తిరిగి నా టెస్టు కెరీర్‌ను చూసుకుంటే నా ముఖంలో చిరునవ్వు కన్పిస్తుంది. ప్రేమతో ఇక సైనింగ్ ఆఫ్..” అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చాడు.

కాగా.. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్‌కు టాటా చెప్పారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. అతడు వైదొలగడంతో ఇంగ్లాండ్ పర్యటనకు కోహ్లీ అత్యంత కీలకమవుతాడని అంతా భావించారు. అంతలోనే తాను కూడా రిటైర్ అవ్వాలనుకుంటున్నానని విరాట్ బీసీసీఐకి సమాచారమిచ్చాడు. దీంతో అతడికి సర్దిచెప్పేందుకు బోర్డు ప్రయత్నించింది. కానీ, కోహ్లీ మాత్రం తన టెస్టు కెరీర్‌ను ముగించేందుకే సుముఖత చూపించాడు.

2011 మధ్యలో టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. ఇప్పటివరకు 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో విరాట్ వ్యక్తిగత అత్యధిక స్కోరు 254 పరుగులు. 2025 జనవరి 3న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడాడు. టెస్టుల్లో ఎన్నో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్.. పదివేల పరుగుల మైలురాయికి కొద్ది దూరంలోనే నిలిచి.. ఈ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

## బంగ్లాదేశ్ కోచ్‌గా అరివీర భయంకరమైన ఫాస్ట్ బౌలర్



బంగ్లాదేశ్ జాతీయ క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా షాన్ టైట్ నియమితుడయ్యాడు. ఆస్ట్రేలియాకు చెందిన ఈ 42 ఏళ్ల మాజీ ఫాస్ట్ బౌలర్ 2027 నవంబర్ వరకు ఈ పదవిలో కొనసాగుతాడు. టైట్ తన కోచింగ్ ప్రయాణంలో పాకిస్తాన్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్తాన్ జట్లకు సేవలందించాడు. టైట్.. 2007లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఆసీస్ తరపున మూడు ఫార్మాట్లలో 59 మ్యాచ్‌లు ఆడిన టైట్.. 95 వికెట్లు తీశాడు. ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా షాన్ టైట్ నియామకంతో ఇప్పటివరకు ఆ పదవిలో కొనసాగిన ఆండ్రీ ఆడమ్స్ వైదొలిగాడు. ఆడమ్స్ గతేడాది మార్చిలో బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఆడమ్స్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ టీ20 వరల్డ్‌కప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పేలవ ప్రదర్శనలు చేసింది. ఈ కారణంగా అతనిపై వేటు పడింది.

**క్రికెట్ చరిత్రలో సెకెండ్ ఫాస్టెస్ట్ బాల్**
షాన్ టైట్ పేరిట క్రికెట్ చరిత్రలో సెకెండ్ ఫాస్టెస్ట్ బాల్ రికార్డు నమోదై ఉంది. 2010లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 161.1 కిమీ వేగంతో బంతిని సంధించాడు. క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన బంతిని వేసిన రికార్డు పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ పేరిట ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్తర్ 161.3 కిమీ వేగంతో బంతిని సంధించాడు.
టైట్‌తో పాటు మరో ఆసీస్ పేసర్ బ్రెట్ లీ కూడా 161.1కిమీ వేగంతో బంతిని సంధించాడు. 2005లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో లీ ఈ వేగాన్ని అందుకున్నాడు.
క్రికెట్ చరిత్రలో నాలుగో వేగవంతమైన డెలివరీ రికార్డు కూడా ఆసీస్‌కే చెందిన జెఫ్ థాంప్సన్ పేరిట ఉంది. థామ్సన్ 197576 సిరీస్లో విండీస్‌తో జరిగిన ఓ మ్యాచ్‌లో 160.6కిమీ వేగంతో బంతిని వేశాడు.
క్రికెట్ చరిత్రలో ఐదో వేగవంతమైన బంతి రికార్డు కూడా ఆసీస్ పేసర్ పేరిటే ఉంది. 2015లో న్యూజిలాండ్‌తో జరిగిన ఓ మ్యాచ్‌లో స్టార్క్ 160.4కిమీ వేగంతో బంతిని సంధించాడు.
ఇదిలా ఉంటే, బంగ్లాదేశ్ జట్టు మే 17 నుంచి యూఏఈలో పర్యటించనుంది. ఈ పర్యటనలో బంగ్లా టీమ్ యూఏఈతో రెండు టీ20లు (మే 17, 19) ఆడనుంది. అనంతరం మే 25 నుంచి బంగ్లా జట్టు పాకిస్తాన్‌లో పర్యటించాల్సి ఉంది. ఈ పర్యటనలో ఇరు జట్లు ఐదు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే భారత్‌తో యుద్ధం తర్వాత పాక్‌లో జరగాల్సిన ఈ సిరీస్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

## టీమ్‌ఇండియా ఇంగ్లండ్ టూర్...

# సెలక్టర్లకు కఠిన పరీక్షే!

**రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రిటైర్‌మెంట్‌తో ఇంగ్లండ్ టూర్‌కు జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. ఆటగాళ్ల ఎంపిక సెలక్టర్లకు కఠిన పరీక్షగా మారింది.**

టీమ్‌ఇండియా, ఇంగ్లండ్‌తో జూన్‌లో అయిదు టెస్టుమ్యాచ్‌లు ఆడనుంది. ఈ టూర్‌కు భారత జట్టు ఎంపిక ప్రస్తుతం సెలక్టర్లకు కఠిన సవాళ్లు విసురుతోంది. ఇటీవలే రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. తాజాగా విరాట్ కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఇలా దాదాపు ఒకేసారి రోకో ద్వయం నిష్క్రమణతో ఇంగ్లండ్‌లో పర్యటించబోయే టీమ్ ఎంపిక సెలక్టర్లకు కత్తిమీద సాములా మారనుంది. దీంతో ఈసారి సీనియర్ బ్యాటర్లు లేకుండానే టీమ్‌ఇండియా, ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది.

**ఎక్కువ సమయమూ లేదు**
ఈ వారంలోనే సెలక్షన్ కమిటీ ఇంగ్లండ్ వెళ్లబోయే ఇండియా ఎ జట్టును ఎంపిక చేయనుంది. సీనియర్ జట్టు ఎంపికకు కూడా పెద్దగా సమయం లేదు. గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అందించే అవకాశాముంది. టీమ్‌ఇండియాకు సారథి ఎవరో ఇప్పటికైతే ఇంకా తేలలేదు. కానీ... ఇండియాఎకు మాత్రం అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. తనుష్ కోటియన్, బాబా ఇంద్రజిత్, ఆకాశ్‌దీప్, కరుణ్ నాయర్ తదితరులు భారత్ ఎ జట్టుకు దాదాపు ఎంపికైనట్లే! నితీశ్ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. ఇంగ్లండ్‌లో




వీరి ఆటతీరు ఆధారంగా వీరిలోంచి పలువురు సీనియర్ జట్టులో స్థానం పొందే అవకాశమూ ఉంది.

**అభిమానుల్లో ఆసక్తి!**
రంజీ ట్రోఫీలో దుమ్మురేపిన శార్దూల్ ఠాకూర్ టీమ్‌ఇండియా సీనియర్ టీమ్‌లోకి తిరిగి వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇంగ్లాండ్ పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తాయి. అందుకే సెలక్టర్ల నుంచి శార్దూల్ పిలుపు అందుకునే ఛాన్స్ ఉంది. ధ్రువ్ జురేల్, రిషభ్‌పంత్.. ఈ ఇద్దరు వికెట్ కీపర్లకు బెర్త్ ఖాయం. ఇషాన్ కిషన్ ఇటీవలే బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు పొందినప్పటికీ ఇంగ్లండ్ టూర్‌కు మాత్రం సెలక్టర్లు ఎంపిక చేయకపోవచ్చు. టెస్టులకు విరాట్ కోహ్లీ రిటైర్‌మెంట్ నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్‌కు టీమ్‌లో స్థానం దక్కే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. తాజాగా ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన సాయిసుదర్శన్ వైపు కూడా సెలక్టర్లు మొగ్గు చూపే ఛాన్స్ ఉంది. ముఖేష్ కుమార్, యశ్‌దయాళ్‌ల పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

ఇటీవలే గాయం నుంచి కోలుకున్న సర్ఫరాజ్ ఖాన్‌కు పిలుపు రావడం కష్టమే. సీనియర్ సీమర్ మహ్మద్ షమీ ఎంపికవడమూ అంత తేలికగా కనిపించడం లేదు. పునరాగమనం తర్వాత షమీ మునుపటి రిథమ్‌లో కనిపించడం లేదు. బౌలింగ్‌లో పదును కూడా తగ్గింది. వికెట్లు తీయడంలోనూ ఇబ్బంది పడుతున్నాడు. వర్క్‌లోడ్ నేపథ్యంలో బుమ్రా కూడా ఈ సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లు ఆడలేకపోవచ్చు. ఏది ఏమైనప్పటికీ ఒకేసారి ఇద్దరు దిగ్గజాల నిష్క్రమణతో ఇంగ్లండ్‌లో టీమ్‌ఇండియా ప్రదర్శన ఎలా ఉండనుందో అని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.